
చరిత్ర





నిన్నటి ప్రపంచానికి చెందిన గోవులు. నాలుక బయటకు వెళ్ళుకొని వచ్చి, ముట్టె నిండా రక్తం. నేలంతా దాని రక్తమే. నేలకడ్డంగా పడి ఉంది. సగం మరణం, సగం చేతనం. ఒక శతాబ్దం నేలకొరిగినట్లుగా ఉందా దృశ్యం.

రాత్రి వచ్చిన కల.

అది మొదలు. అంతకు ముందో కబురు.

“రక్తపాతం జరక్క తప్పేలా లేదు. బాణాకర్రలు, వేటకత్తులు, కొడవళ్ళు తయారుగానే ఉన్నాయి. రక్తాన్ని ధారపోస్తే గాని నిలుపుకోలేని జీవితాలు. నాయనా! ఒరే! మరింక ఇవి చివరి మాటలే అయితే అమ్మను పదిలంగా చూసుకోరా!”

* * *

మనోహరరావు పత్రికాఫీసు మెట్లు ఎక్కుతున్నాడు. తన చావును తనే మోస్తున్నట్లుగా ఉన్నాడు. అతను సాయంకాలం కోసం, చీకటి కోసం ఎదురు చూస్తున్నాడు. కానీ చీకటింక ముసరనేలేదు. గట్టిగా నిట్టూర్చి, ఒక నిర్భీతిని సూచించే ఠీవితో నిలబడి ‘హుమ్!’ అనుకొని తన గదివైపు నడిచాడు. పాదం కింద జిగటజిగటగా రక్తం పారినట్లుగా. ఉలిక్కిపడి పాదాన్ని వెనక్కు లాక్కొన్నాడు. కాళ్ళ కింద రేపటి వార్తాపత్రిక. దాహంగా, ఆకలిగా, అసహనంగా ఉన్నాడతను. అసహనం అడుగు అడుగుకూ పెరుగుతుంది. గాలిలో ఏవో రహస్య స్వరాలు. అతని చెవిలోనే ఏదో రహస్యాన్ని ఊదుతున్నట్లుగా. సాయంకాలం అయిదుగంటలే. మొదటి పేజీ ప్రూఫులు తెచ్చి చూపాడో కుర్రాడు. అక్షరాల్ని చేత్తో తడిమాడు. పుర్రెల్ని తడిమినట్లుగా, ఒళ్ళంతా జలదరింత. నల్లటి, దుఃఖపు సాయంకాలం. బరువైన చరిత్ర పుస్తకంలా మనోహరరావు.

“పర్సనల్ లెటర్ ఒకటుంది. మీ టేబుల్‌పై పెట్టాను” ఆఫీస్ బాయ్ టేబుల్‌పై తెల్లటి కవరు పెట్టాడు. మినియేచర్ గోవులా తెల్లగా నిర్మలంగా ఉంది. చిరునామాదారుడే తెరవాలని, అర్జంటు కబురు త్వరగా డెలివరీ చేయండని కూడా దానిపై రాసి ఉంది. ఎందుకో ఆ ఉత్తరాన్ని చదవాలనిపించ లేదు మనోహరరావుకు. టేబుల్‌పై నుంచి ఉత్తరం లాక్కొని గబగబా జేబులో కుక్కుకొన్నాడు.

* * *

"నిజానికి నాస్టాలజియా వేరు, జ్ఞాపకాలు వేరు. నాస్టాలజియా ఒక మరుపు. గతంలోకి కుచించుకుపోవటం. జ్ఞాపకాలు అట్లా కాదు. గతాన్ని స్పృశిస్తూ భవిష్యత్తులోకి ప్రయాణిస్తాయి. గొప్ప రచయిత తన అనుభవాన్ని సామూహిక జ్ఞాపకంగా మార్చి, ఒక సత్యాన్ని ఆవిష్కరిస్తాడు. ఆ సత్యం ఒక్కోసారి అధికారిక చరిత్రపై ప్రకటించిన యుద్ధం కూడా అవుతుంది."

మనోహరరావు లిటరరీ కాలం కోసం వ్యాసం రాస్తున్నాడు. సుందర అనే రచయిత రాసిన 'చరిత్ర' నవలపై సమీక్షా వ్యాసం రాస్తున్నాడు. 'చరిత్ర' దళిత నవల. తొంబయి ఆరులో రాసింది. దళిత సాహిత్యంలో దానినో మైలు రాయిగా చెప్పుకొంటారు.

చరిత్ర నవలలో సుందర తన గ్రామం గురించిన, తన బాల్యం గురించిన జ్ఞాపకాల్ని రాశాడు. తన శ్రమ, తన కష్టం, తన చదువు, తన పట్టణ జీవితం అన్నింటినీ డైరీ రూపంలో రాశాడు. జీవితం ప్రతి దశలోనూ కులం తన మెడకు చుట్టుకొన్న అనకొండలా అతనినెట్లా గొంతు నులిమిందీ చెబుతాడు. క్రిస్టియన్ మతాన్ని పుచ్చుకోవటం, చర్చితో అతని సంబంధం, సిటీలో ఉద్యోగం, నాజూకు భాష, ఖరీదు జీవితం, తన జాతి నుంచి తను ఎట్లా ఎలియనేట్ అయ్యిందీ, చివరకు అంతట్నీ వదిలేసి మళ్ళీ తన గ్రామానికి తన మూలాల్ని వెతుక్కొంటూ వెళ్ళటం వివరిస్తాడు.

చాలా రోజులుగా ఈ నవల మనోహరరావు గుండెను సలుపుతుంది. కనపడకుండా పోయిన గాయమేదో, చర్మాన్ని చీల్చుకొని వెలికి వచ్చినట్లుగా ఉండేది.

పుస్తకంగా రాకముందు, ఆరునెలల పాటు సీరియల్‌గా వచ్చిందీ నవల. మామూలు వారపత్రికలలో, దినపత్రికలలో కాక ఉస్మానియా యూనివర్శిటీ హాస్టల్‌లో పబ్లిష్ అయ్యే 'దళిత సూరీడు' అనే వాల్ పేపర్‌లో ఈ నవల సీరియల్‌గా వచ్చింది. ఉదయాన్నే అలారం మోత కన్నా ముందే లేచి, హడావిడిగా తలకో మఫ్లర్ చుట్టుకొని, చలిలో యూనివర్శిటీ వైపు నడిచేవాడు. వణికే చేతుల్తో, వెచ్చటి ఊపిరిని ముక్కుల్లోంచి ఉఫ్ ఉఫ్ అని ఊదుకొంటూ, ఒక శీతల దుఃఖంలోంచి, వెచ్చని ఊహాలోకానికి ప్రయాణిస్తున్న వాడిలా ఉండేవాడు. ఆందోళనగా, ఒక అబ్సర్డ్ పోయమ్‌లా ప్రవర్తించేవాడు. హాస్టలు గేటు ముందున్న బంకు దగ్గర ఆగి, సిగరెట్టు కొనుక్కొని, నికోటిన్ పొగల్ని గుండెల నిండా పీల్చుకొని, ఒక అద్భుతమైన అనుభవం కోసం ఎదురుచూస్తున్న వాడిలా ఉద్రేకపడేవాడు. రీసెర్చి స్కాలర్స్ హాస్టల్ నోటీసు బోర్డులో ఉన్న దళిత సూరీడు అనే నాలుగు పేజీల వార్తాపత్రికను, అందులోని చరిత్ర సీరియల్‌ను చదివే వరకు అతని ఆరాటం తగ్గేది కాదు. చదువుతున్నంతసేపూ

గొప్ప ఉద్రేకం, సంచలనం కలిగేవి అతనిలో. కథలోని ఊరు అతనికి తెలిసినట్టే ఉండేది. సుందర రాసింది నవల కాదని, ఎవరిదో బాగా తెలిసిన వ్యక్తి జీవిత చరిత్ర అని అతని నమ్మకం. ఆ జీవితచరిత్ర తనది కూడా అయ్యుండవచ్చని అతని అనుమానం.

చీకటి ముసిరిన వేళ, సాయంకాలాల్లో వందలాది, వేలాది కాకులు 'కావ్ కావ్' మంటూ, రెక్కల్ని టపటపలాడించుకొంటూ గుడిసెలపై ఎగరటం గురించి రాసిన అధ్యాయం... అతనికి బాగా గుర్తున్నప్పటి చిన్నప్పటి సంఘటనను పోలి ఉండేది.

అదొక సందడి. గొప్ప యుద్ధపు పాటను వింటున్నప్పుడు కలిగే తత్తరపాటు. ఆ కాకులు రావటం కోసం సాయంకాలం నాలుగు నుంచే పిల్లలందరూ ఎదురుచూసేవాళ్ళు. చెట్లు, గుడిసెలు. ఆ ప్రదేశమంతా నల్లటి పూలతోటలా మారేది. ఒక సాయంకాలం 'థాం థాం' అనే తుపాకీ చప్పుళ్ళతో నేలంతా అదిరింది. (ఆ తుపాకీ ఎవరు కాల్చారో ఇప్పటికీ ఎవరికీ తెలియదు). కాసేపటికి గుడిసెలపై, చెట్ల కొమ్మలపైన విరిగిపడ్డ రెక్కలు, తెగిన తలలు, ముక్కులు, కాళ్ళు. ఆకాశమంతా నల్లని ఈకల మబ్బులు – ఈ దృశ్యమంతా మనోహరరావుకు తెలిసిందే. ఈ దృశ్యం, తరువాత జరగబోయే విషాద సంఘటనను చెప్పడానికి వాడుకొన్న మెటాఫర్ అని కూడా అతనికి తెలుసు.

గ్రామానికి, మాదిగ పల్లెకీ మధ్యన ఉంది శ్మశానం. అతనికి రెండు తరాల ముందు నుంచీ మాదిగలలో క్రిష్టియానిటీ ఎక్కువగా ఉంది. శవాన్ని ఖననం చేసి, సమాధి ఫలకాన్ని అక్కడ పెట్టడం ఆనవాయితీ. "మా కొంపల పక్కనే శవాన్ని కుళ్ళబెడతారా?" అంటూ గొడవ మొదలుపెట్టారు ఆసాములు. ఒక అర్ధరాత్రి శ్మశానం గోడను పగలగొట్టుకొని, ట్రాక్టర్లు శ్మశానం అంతా వీరవిహారం చేశాయి. సమాధి పలకలు నేలకూలాయి. మరీ లోతుగా పూడ్చని సమాధుల్లోంచి, ఎముకల పోగులు బయటకు వచ్చాయి. గుండెల్ని చీల్చినట్లుగా గొల్లుమన్నారు. పల్లెలో వాళ్ళు రాత్రికి రాత్రి కర్రలతో, పలుగులతో, గొడ్డళ్ళతో ఊరిపై పడ్డారు. వాములు తగలబడ్డాయి. గొడ్లతాళ్ళు తెగి, మందలు పొలాన పడ్డాయి. గ్రామం మధ్యలో యుద్ధమే జరిగింది. మరుసటిరోజు ఊళ్ళోకి పోలీసులొచ్చారు. మగవాళ్ళంతా కనబడకుండా వెళ్ళిపోయారు. పోలీసులు, మాదిగ పల్లెపై బడి, గుడిసెల్ని తగలబెట్టి, ఆడవాళ్ళను అల్లరిపెట్టిన ఆ మారణకాండ ఒక చరిత్ర అయింది. ఆ గొడవలు జరిగేనాటికి మనోహరరావుకు ఎనిమిదేళ్ళు.

ఆ సంఘటన యధాతథంగా చరిత్ర నవలలో రాయటం అతనికి విస్మయంగా ఉంది. 'ఈ సుందర ఎవరో నాకు బాగా పరిచయమున్న వ్యక్తి'

అనుకొన్నాడు. 'నా గురించే కాదు, నాయన గురించి కబుర్లు కూడా తెలిసిన మనిషే' అనుకొన్నాడు. ఆ గొడవల్లో మనోహరరావు తండ్రికి కాలు విరిగింది. గాయానికి కట్టుకట్టక, క్రమంగా సెప్టిక్ అయ్యి, కాలు తీసివేయాల్సిన పరిస్థితి వచ్చింది. 'కుంటి అయ్యవారు' అని వాళ్ళ నాన్నను పిలిచేవారు. నవలలో ఈ కుంటి అయ్యవారే ప్రొటోగనిస్టు.

మనోహరరావు తన వ్యాసాన్ని ముగిస్తూ "నవలలో రచయిత తనను తాను రెక్కలు విరిగిన పక్షిలా వర్ణించుకొంటాడు. అయితే తన రెక్కలు విరిగినతనమే, తన జాతిలో తిరిగి కలిసే ఒక మహోద్యమానికి మొదలు కావటం కూడా రచయిత గుర్తించాడు. తను, తన బలం, తమను తాము విముక్తం చేసుకొనే ఒక ఉద్యమంలోకి అడుగు పెట్టినట్లుగా, ఆశావహంగా నవల ముగుస్తుంది" అని రాశాడు.

వ్యాసాన్ని డి.టి.పి.కి పంపి బలంగా నిట్టూర్చాడు మనోహరరావు. కుర్రవాణ్ణి టీ, సిగరెట్లు పట్టుకురమ్మని పంపించాడు. జేబులోని ఉత్తరం నిలవబెట్టిన శవంలా బరువుగా తోచింది. క్రమంగా నిశ్శబ్దం, చీకటి ఆఫీసు పొడవునా పరచుకొన్నాయి. ప్రూఫ్ రీడింగ్ కోసం వ్యాసం మళ్ళీ అతని దగ్గరకు వచ్చింది. ప్రూఫ్‌లొద్దు, నగిషీలొద్దు అంటూ పేజీలు తెచ్చిన కుర్రవాణ్ణి కసురు కొన్నాడు.

ఒంటరితనం, నిస్తేజం అతన్ని చుట్టుముట్టాయి. అర్థం కాని భయం. గుండెలు గుబులు గుబులుగా "ఇంత ఆలస్యం అయ్యిందేం?" అని టీ తెచ్చిన కుర్రవాణ్ణి విసుక్కొన్నాడు. "రోడ్డు మధ్యలో బర్రె ఒకటి చచ్చిపడి ఉంది. అటూ ఇటూ ట్రాఫిక్ ఆగిపోయింది. పదిమంది కలిసి లాగుతున్నా బర్రె కదలటం లేదు" కుర్రవాడు బర్రెను తొలగించే కార్యక్రమాన్ని వివరి స్తున్నాడు. ఉలిక్కిపడ్డాడు మనోహరరావు. గుండెలు పెద్దగా డబ్‌డబ్ మని కొట్టుకొన్నాయి. కలలోంచి ఇట్లా రోడ్డుపైకి బర్రె శవం రావటం - సాదాసీదా జీవితం ఇంత మెటాఫిజికల్‌గా అయ్యిందేం అని విస్తుపోయాడు. ఏ దుఃఖానికి, ఏ చావుకు ఇది ప్రతీకో అని కలతపడ్డాడు.

హఠాత్తుగా అతనికి ఉస్మానియా హాస్టల్‌వైపు వెళ్ళాలనిపించింది. నోటీసు బోర్డు, వాల్‌పేపరు 'దళిత సూరీడు' చూడాలనిపించింది. ఎందుకో తను ఎదురుచూసే వార్త అందులో ఉండవచ్చని కూడా అతనికెందుకో అనిపించింది.

మెల్లగా రోడ్డుపైకి వచ్చాడు. రోడ్డు పొడవునా వాహనాలు క్రిక్కిరిసి ఉన్నాయి. గేదె శవం ఇంకా అట్లాగే ఉంది. పోలీసులు, ఫైర్ సర్వీసు వాళ్లు విశ్వ ప్రయత్నం చేస్తున్నారు, దాన్ని తొలగించాలని.

రోడ్డు అంచున అట్లాగే నడుస్తూ చాలా దూరం వెళ్ళాడు. కొన్ని దీపాలు వెలిగి, కొన్ని దీపాలు వెలగక, రోడ్డు కాస్త చీకటిగా, కాస్త వెలుతురుగా కలలో వాతావరణంలా ఉంది. అబిడ్స్ దాటి, తిలక్‌రోడ్డు వైపు నడిచాడు. ఆంధ్ర సారస్వత పరిషత్తు, నాటక వారోత్సవాలు అంటూ పెద్ద బేనర్. ఏడు గొప్ప తెలుగు కథల్ని నాటకాలుగా మార్చి ప్రదర్శిస్తున్నారు. రోజుకొకటి చొప్పున. ఆ వేళ కాళీపట్నం రామారావు యజ్ఞాన్ని ప్రదర్శిస్తున్నారు.

"నాటకం సగానికి పైనే అయిపోయింది. ఇంకిప్పుడేం చూస్తారు. రేపు రండి మరో నాటకం మొదట్నుంచి చూద్దురుగాని.' గేటు దగ్గరి మనిషి ఉచిత సలహా.

"అసలు నాటకాల్ని నేను మధ్యనుంచే చూస్తాను. ప్రశ్నలన్నిటికీ సమాధానాలు దొరికేది అప్పట్నుంచే" అతని ఆశ్చర్యాన్ని పట్టించుకోకుండా లోపలికి వెళ్ళాడు.

హాలు దాదాపుగా నిండి ఉంది. స్టేజీ పైన, నాటకంలో శ్రీరాములు నాయుడు సభ తీరి ఉన్నాడు. అప్పల్రాముడు దిగులుగా, శూన్యంగా కూర్చున్నాడు. హాలులో గొప్ప ఉత్కంఠ. ఒక మూలనున్న సీటులో కూలబడ్డాడు మనోహరరావు. దానికి కుడివైపు చెయ్యి విరిగి ఉంది. సీటు కాస్త లోపలికి ఒరిగి, రంగస్థలం ఎక్కడో పైన ఉన్నట్టుగా ఉంది. అతను కూర్చున్నచోటు నుండి సగం రంగస్థలం మాత్రమే కనిపిస్తుంది. అక్కడ నుంచి చూస్తే అప్పల్రాయుడు, అతని సంతానం మాత్రమే కన్పిస్తున్నారు. తీర్పు చెప్పే శ్రీరాములు నాయుడు, మిగిలిన ఊరిపెద్దలు మాటలు మాత్రం వినిపిస్తున్నాయి. మనుషులు కనబడటం లేదు.

పదేళ్ళనాటి అప్పుకు, గోపన్న షావుకారుకు అప్పల్రాముడికి మిగిలిన రెండెకరాల భూమి అమ్మి పైకం తీర్చడానికే నిర్ణయించాడు శ్రీరాములు నాయుడు. పత్రాలపై సంతకాలు పెట్టే ముందు, మాల మాదిగెలెట్లా దోపిడీ చెయ్యబడ్డారో, షావుకార్లు, ఆసాములు ఎట్లా పైకి ఎదిగారో వివరిస్తున్నాడు అప్పల్రాముడు. "ఇది యాభై యేళ్ళ క్రిందటి మాట... అప్పటికి ఇక్కడున్న జనంలో మీరెవ్వరూ పుట్టలేదు..."

తన సీట్లోంచి చూస్తే స్టేజీపై అప్పల్రాముడు ఒక్కడే కనిపిస్తున్నాడు. అప్పల్రాముడిలో తన తండ్రి పోలికలు కనబడ్డాయి మనోహరరావుకి. తండ్రి రామయ్యను పంచాయితీ బోర్డు మెంబరుగా ఎన్నుకోవాలని ఊళ్ళో అంతా తీర్మానించారు. "మాదిక పల్లెను దువ్వి, ఓట్లు కాజేయడానికి ఇదో కుట్ర! వద్దయ్యా" అంటూ మనోహరరావు పోరాడు. "బస్తీల్లో చేరి నాజూకు మాటలు నేర్చి మమ్మల్ని మరిచిపోయిన నీకు మా పల్లె ఊసులేల?" ఒక్కమాటలో

తండ్రి అతనిని దూరంగా విసిరివేశాడు. తరువాత రెండేళ్ళలోనే మనోహరరావు తండ్రి మార్కెటింగ్ సొసైటీకి ఛైర్మన్ అయ్యాడు. ఎన్నికలయిన రెండోరోజునే తండ్రి అనుచరుడొకణ్ణి, డొంకలో పట్టుకొని పొడిచేశారు. దానిపై కేసు లేదు. ఎఫ్.ఐ.ఆర్. లేదు. మాదిగ పల్లెలోని కుర్రాళ్ళనందరినీ తీసుకొని హైదరాబాద్ వచ్చాడు రామయ్య. అసెంబ్లీ ముందు టెంటు వేసి నిరాహారదీక్ష మొదలు పెట్టాడు. న్యూస్ కవరేజికి మనోహరరావే వెళ్ళాడు. "ఈ వయసులో ఎందుకు నాయనా నీకీ గొడవలూ. నువ్వూ, అమ్మా వచ్చి నా దగ్గర ఉండక!" మనోహర రావు మాటలకు కోపంగా, అసహ్యంగా, తిరస్కారంగా చూశాడు అతని తండ్రి. ఆ రాత్రి పోలీసులు టెంటు పీకివేసి, కూర్చున్న జనంపై ఎడాపెడా లాఠీఛార్జీ జరిపారు. తల పగిలి తండ్రి హాస్పిటల్‌లో చేరాడు. తండ్రిని చూడడానికి వెళ్ళి నప్పుడు "నాయనా మనోహరా! లాఠీఛార్జికి వ్యతిరేకంగా ఊళ్ళో పెద్ద ఊరేగింపు జరిగినాదట కదా! నువ్వు అందులో ఉండావా నాయనా?" అని అడిగాడు.

మనోహరరావు ముఖంలో నెత్తురుచుక్క లేదు. "ముఖ్యమైన సంపాద కీయం రాస్తూ..." నీళ్ళు నమిలాడు మనోహరరావు. నాటకం చూస్తున్నంతసేపూ మనోహరరావులో పెద్దపెట్టున దుఃఖం కలిగింది. పశ్చాత్తాపం కలిగింది. గొప్ప పోరాటంలో భాగం కాలేని తనపై తనకే విరక్తి కలిగింది.

స్టేజీపై చిన్న అంతరాయం - "ఒరేయ్! ఒరే కొడుకా! నువ్వు బానిస బతుకు బతుకుతావా లేదా సస్తావా!" అంటూ కొడుకును బానిసను చెయ్యలేక వాణ్ణి కత్తితో సటుక్కున నరికి గోనెసంచిలో వేసుకొచ్చి స్టేజీపైన దబ్బున కూలవేసి.... "నువ్వూ తండ్రివే! నేనూ తండ్రినే! ఎవరు గొప్పో నువ్వే చెప్పు!" అంటూ తండ్రిని సీతారాముడు అడిగే సమయానికి కరెంటు పోయింది. గొప్ప చీకటి. జనంలో విసుగు. అసహనంగా అటూ ఇటూ కదులుతున్నారు.

మనోహరరావు సీట్లోనే కూర్చున్నాడు. అంత చీకట్లోనూ అప్పలరాముడు స్పష్టంగా అతనికి కనిపిస్తున్నాడు. ఆ చీకట్లో ఏదో పూనినవాడిలా మనోహరరావు స్టేజీ వైపు నడిచాడు. క్రమంగా దృష్టిలోంచి అప్పలరాముడు తొలిగిపోయి తండ్రే కన్పిస్తున్నాడు. "నాయనా! నువ్వు మహానుభావుల కోవలోకి చెందినవాడివి!" అని చెప్పాలని మనోహరరావు కోరిక. "నన్ను క్షమించవే! పిరికి సన్నాసిని నాయనా!" అంటూ ఆయన కాళ్ళు పట్టుకోవాలని మనోహరరావు ఆలోచన. "మరింక ఈ నగరం వదిలి నీ దగ్గరకు వస్తానే!" అని చెప్పాలని అతని నిర్ణయం.

ఒక పూనికతో అట్లాగే స్టేజీ పైకి ఎక్కాడు మనోహరరావు. కరెంటు వచ్చి, లైట్లు వెలిగి అప్పలరాముడి కాళ్ళ ముందు కూలబడి పెద్దగా ఏడుస్తున్న మనోహరరావు కనబడ్డాడు ప్రేక్షకులకి.

ప్రేక్షకులలో ఆశ్చర్యం, అయోమయం. సీతారాముడు పాత్రధారి, అతన్ని భుజం పట్టుకొని లేవదీసి బయటకు తోశాడు. ఇద్దరు వాలంటీర్లు, అతన్నో పిచ్చివాడిగా భావించి స్టేజీపై నుంచి బయటకు లాక్కువచ్చారు. ఆ ప్రయత్నంలో మనోహరరావు చొక్కా చిరిగింది. ట్రాన్స్‌లోంచి కొద్దిగా తేరుకొని, అక్కడ ఉన్న అరుగుపై కూలబడ్డాడు మనోహరరావు. అయితే వాలంటీర్లిద్దరూ అతని రెండు భుజాలు పట్టుకొని గేటు బయట వరకూ లాక్కువెళ్ళారు.

రోడ్డు మీద అట్లాగే అచేతనంగా ఉండిపోయాడు మనోహరరావు. ఒంటి నిండా, బట్టల నిండా దుమ్ము. అతనికి చాలా దుఃఖంగా ఉంది. దుఃఖం అట్లా అవమానకరంగా బయటకు గెంటి వేసినందుకో లేక తండ్రికి క్షమాపణ చెప్పే అవకాశం పోయినందుకో క్షణంపాటు అర్థం కాలేదు.

ఇట్లా ఈ రాత్రిపూట వెతుకులాట మాని ఇంటికి వెళ్ళి, తన గదిలో వెచ్చగా, నాలుగు ఆఫ్రికన్ పుస్తకాలపై కాళ్ళు నిగడతన్ని పడుకొని, టి.వి.లో పార్లమెంటు లైవ్, సౌండు పెద్దగా పెట్టుకొని... ప్రజాస్వామ్యపు 'లైవ్' చప్పుళ్ళ మధ్య హాయిగా నిద్రపోతేనో?' అనుకొన్నాడు.

లేచి నిలబడి వీధి చివరిదాకా వెళ్ళాడు. వీధి మధ్యలో పోలీసెవడైనా కనిపిస్తే తనకు జరిగిన అవమానాన్ని ఒంటిపైని చొక్కాని సైతం చింపివేసిన వైనాన్ని గురించి రిపోర్టు చెయ్యాలనుకొన్నాడు. పోలీసు రోడ్డు పక్కనున్న చాయ్ బంక్ దగ్గర నిలబడి ఉన్నాడు. ఇద్దరు అసహాయమైన ఆడవాళ్ళతో బేరాలాడు తున్నాడు. వాళ్ళ జాకెట్టులోంచి ఒక్కొక్కటే రూపాయలు బయటకు లాగు తున్నాడు. 'ఛత్!' అనుకొని రోడ్డుకున్న మరో మలుపులోకి తిరిగాడు.

డిసెంబర్ రాత్రి చలి. ఒంటిపైన చొక్కా కూడా చిరిగి ఉంది. వణికించే చలి. కత్తులు పట్టుకొని కనబడని మనిషెవడో పొడుస్తున్నట్టుగా చలి. రోడ్డు కెదురుగా అటుకాస్త దూరంగా అంబేద్కర్ విగ్రహం సూటు వేసుకొచ్చిన బుద్ధుడిలా.

హఠాత్తుగా రోడ్డు నెలల తల్లిగా మారి, వందలాదిగా మనుష్యుల్ని ప్రసవించడం మొదలుపెట్టింది. ఏ వీధిలోంచి వస్తున్నారో వెంటనే పోల్చుకోలేక పోయాడు. తెల్లటి మంచులోంచి నల్లనల్లగా బయటకు వస్తూ, వాళ్ళు ఈలోకపు మనుష్యులు కాదేమోననిపించింది. అతనట్లా నిలబడి ఉండగానే, వాళ్ళు అతణ్ణి తోసుకొంటూ, హడావుడిగా వెళుతున్నారు. పైకి ఎగగట్టుకొన్న పంచెలు, చిరిగిన చొక్కాలు, పైన కండువాలు. పల్లెటూరి జనం. కొద్దిమంది ఆడవాళ్ళు కొంగు లను తలకు, భుజాలకు చుట్టుకొని ఉన్నారు. "ఎవరు? ఎవరు మీరు?" తనను తోసుకొంటూ వెళ్ళే మనుష్యుల్ని ఆపి అడిగాడు. 'దండోరా...' 'ఛలో అసెంబ్లీ....' 'ఎబిసిడిల కోసం పోరాటం' నాలుగైదు వైపుల నుండి సమాధానాలు

వచ్చాయి. వాళ్ళట్లా చలికి వణుకుతూ పెద్దపెద్దగా కబుర్లు చెప్పుకొంటూ, గడ్డగట్టిన వాగులా రోడ్డుపై ప్రవహిస్తూ, వెళుతున్నారు. 'డర్‌డమ్‌డం... డర్‌డమ్ డం...' గుంపు మధ్య పెద్దగా పాడుతూ ఉన్న మ్యూజికల్ గొంతు వినబడింది. ఆ మనిషిని గుర్తుపట్టాడు మనోహరరావు. మోహనసుందరం. ఉద్యమాల మనిషి. అన్నీ తెలిసినవాడు. భవిష్యత్తు గురించి నాలుగు మంచి మాటలు చెప్పగల 'సూత్-సేయర్'. అతను మనోహరరావు పక్కనుంచే వెళ్ళాడు. వెళుతూ, వెళుతూ క్షణంసేపు ఆగి, తన ఒంటిపైని శాలువాను మనోహరరావు పైకి విసిరి వెళ్ళిపోయాడు.

దండోరా మనుషులు అట్లా రోడ్డు పైనుంచి వెళుతూనే ఉన్నారు. వాళ్ళు అట్లా మలుపు దాటారో లేదో, హడావుడిగా ఇద్దరు మనుషులు ఆవైపు పరిగెత్తటం కనిపించింది మనోహరరావుకు. వాళ్ళలోంచి ఒకడు, బొడ్డులోని తుపాకీని సరిచూసుకోవటం కూడా చూశాడు మనోహరరావు. వాళ్ళ గుంపును అందుకొని అందులో కలిసిపోవాలని పరిగెడుతున్నారు. 'మోహనసుందరం! బహుపరాక్!' అని చెప్పాలనుకొన్నాడు. చలికి బిగుసుకుపోయిన కండరాలు తెరుచుకోలేదు. గొంతులో కేక గొంతులోనే ఉండగా తుపాకీ పేలిన చప్పుడు వినిపించింది. 'వామ్మో! దేవుడో! నాయనో!' అంటూ అరుపులు వినిపించాయి. మనుషులు చచ్చిపోతున్న శబ్దం. గుంపు చెదిరిపోతున్న శబ్దం. పెద్దగా ఏడుస్తూ కేకలు పెడుతున్న శబ్దం వినిపించాయి మనోహరరావుకు.

వీధిలో హడావుడి. దీపాలు భగ్గుమన్నాయి. జీపులు, కార్లు మెల్లమెల్లగా రోడ్డు నాక్రమించాయి. క్లిక్‌క్లిక్ మంటూ ఫోటోలు, ప్రశ్నలు, ఇంటర్వ్యూలు.... వార్తాసేకరణ.

"హలో మనోహరరావుగారూ! ఎంతసేపయింది వచ్చి?" క్రైమ్ రిపోర్టర్ రెడ్డి, మనోహరరావును ఆపాడు.

"చరిత్ర మొదట్నుంచీ ఉన్నాను" పరాకుగా అన్నాడు మనోహరరావు. అంతలోనే ఉలిక్కిపడి "ఇప్పుడే, ఇట్లా ఈ మలుపు నుంచి వస్తున్నాను" అన్నాడు.

"ఏమిటిది? చౌక్కా చిరిగి, మీపైన దాడి ఏదయినా..." ఆతృతగా అడిగాడు రెడ్డి.

"నో, నో!" అంటూ తల ఊపాడు.

"అన్నట్టు సార్! మీకో టెలిగ్రాం వచ్చింది. నిన్నటి నుంచీ నా జేబులోనే ఉండిపోయింది. ఎక్కడన్నా కనిపిస్తారేమోనని జేబులోనే పెట్టుకొన్నాను" అంటూ టెలిగ్రాం అందించాడు రెడ్డి.

మనోహరరావు బిగుసుకుపోయాడు. టెలిగ్రామ్‌ను అతని చేతుల్లోంచి లాక్కొని, దాన్ని చించి చదవకుండానే జేబులో కుక్కుకొన్నాడు. క్షణమాగి, అతనివైపు తిరిగి "ఇందులోని విషయం నాకు ముందే తెలుసు!" అన్నాడు మనోహరరావు దుఃఖ గంభీరంగా. మనోహరరావు శరీరమంతా పొడవాటి గాయంలా మారి, గాయం పొడవునా మరణ వార్తలే స్రవిస్తూ... యూనివర్శిటీ వైపు ప్రయాణం మాని ఇంటిదోవ పట్టాడు.

* * *

అర్ధరాత్రి పన్నెండు గంటలు. సరిగ్గా పన్నెండు గంటలు. తన గదిలో ఒక్కడే మనోహరరావు. డెస్కుపై ఆరోజే వచ్చిన రెండు రిజిష్టర్డు పార్శిళ్ళు. డెస్క్ పైనే టీ కప్పు. అందులో చల్లారిన ముదురు ఎరుపురంగు ద్రవం. ద్రవంతో సహా టీ కప్పు మరణించిన సంతోషంలా ఉంది. గది నిండా గుట్టలు గుట్టలుగా నిశ్శబ్దం. మహిషం ఆవులించినట్లుగా మత్తుగా, దిగులుగా. జేబులోని ఉత్తరం, టెలిగ్రామును కూడా బయటకు తీశాడు. టేబుల్ పైని పార్శిళ్ళపై పెట్టాడు. 'మొత్తం నాలుగు మరణాలు. ఏది ముందు?' అనుకొన్నాడు.

బరువుగా లావుగా ఉన్న పార్శిలు విప్పాడు. చరిత్ర నవల. పేజీ తిప్పితే 'మనోహరానికి, తన దారిని, మూలాలని తెలుసుకొంటాడనే ఆశతో...' సుందర. బ్రాకెట్లో కుంటి అయ్యావారు. ఇంకో బ్రాకెట్లో వీరపోగు రామయ్య. దిమ్మెరపోయాడు మనోహరరావు. భయంగా, దిగులుగా మరో ప్యాకెట్ విప్పాడు. డెమ్మీ సైజు ఫోటో. తల లేని, ఒట్టి మొండెము. తెగిన మెడపై రక్తం ఎండి, నల్లగా కమిలి. భయంతో బిగుసుకుపోయాడు మనోహరరావు. ఎదురుచూసిన మరణం. భీకరంగా, కడుపులోని పేగుల్ని తోడేంత భయంకరంగా. టెలిగ్రాం చించాడు "ఫాదర్ కిల్డ్ బ్రూటల్లీ! స్టార్ట్ ఇమ్మీడియట్లీ!"

ఉత్తరం తెరిచాడు "నాయనా! మీ అయ్యను చంపేశారు. దినానికైనా రాకపోతివే. దేనికి భయపడుతున్నావు. చావుకా? పల్లెకు రావడానికా? లేక మీ అయ్యకా?" అమ్మ వీరపోగు దేవమ్మ. అట్లాగే ఆ ఉత్తరాలపై వాలిపోయి పెద్దగా ఏడవడం మొదలుపెట్టాడు మనోహరరావు.

*- మాభూమి వారపత్రిక, 8-1-1999*